సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



రుణమాఫీ వడ్డీకి సరిపోదు

సీఎం ప్రకటించిన రుణమాఫీ రైతు చెల్లించిన వడ్డీకి సరిపోదని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు.

8లో..



అందరికీ న్యాయం చేయండి

వీఆర్ఏలలో అసలుదారులకే రెగ్యులర్ చేయడంతో ఈసాదారులం రోడ్డున పడతామని కలెక్టర్‌కు తెలిపారు.

8లో..



తాగునీటికి కటకట

హుస్నాబాద్ పట్టణంలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

9లో..

న్యూస్‌రీల్

మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం బంద్



బాక్సులు తెచ్చుకొని తింటున్న విద్యార్థులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని పెద్దమ్మగడ్డ పాఠశాలలో మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం బంద్ అయింది. వంటచేసే వారు రాకపోవడంతో పిల్లలు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుని తింటున్నారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మాత్రం హెచ్‌ఎం చొరవ తీసుకుని వేరేచోట వంట చేయించి పెట్టినట్లు తెలిసింది. పిల్లలకు మధ్యాహ్నభోజనం అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గురువారం ఈ విషయమై స్థానిక ఇంచార్జి ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డితో మాట్లాడే ప్రయత్నం చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది.

'సదరం' సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటరూరల్: దివ్యాంగుల గుర్తింపు కోసం నిర్వహించనున్న సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చంద్రమోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈనెల 10వ తేదీ, 17వ తేది, 24వ తేదీల్లో క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి హాజరు కావాలనుకునేవారు మీ సేవ, ఈ సేవ సెంటర్లలో వైకల్యంపై ఆన్‌లైన్ స్లాటు బుకింగ్ చేయించుకున్న రసీదు, ఆధార్ కాపీతో రావాలని సూచించారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌వలీ అహ్మద్, కార్యదర్శులు రవీందర్, రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 5న రాష్ట్రస్థాయిలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు ఉపాధ్యాయుల తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం గజ్వేల్‌లోని పలు గురుకులాలను సందర్శించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలకు పోటీగా విద్యనందిస్తున్న గురుకులాలకు సొంత భవనాలు, బోధన, బోధనేతర సిబ్బంది లేకపోవడంతో విద్యారంగం కుంటుపడే పరిస్థితి నెలకొందన్నారు.

గ్రామ పంచాయతీకి తాళం



పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఇతర నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ కొందరు మహిళలు గురువారం పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 25 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.కోటి 26 లక్షలు మంజూరై ఏళ్లు గడుస్తోందని తెలిపారు. టెండర్‌లు పూర్తయినా నిర్మాణాలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలో వేరే నిర్మాణాలు చేపడితే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మిస్తున్నారని ఆందోళన చెందవద్దని సర్పంచ్ సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బెజ్జంకి, బేగంపేటలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు బెజ్జంకి డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

సిద్దిపేటరూరల్: మంత్రి హరీశ్ రావు చొరవతో ఏర్పాటు చేస్తున్న కుట్టు మిషన్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నగుండవెళ్లి గ్రామంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పుల్లూర్ రాఘవాపూర్, చిన్నగుండవెల్లి గ్రామాలలో 50 మంది మహిళల చొప్పున శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోటగిరి శ్రీహరిగౌడ్, రఘోత్తంరెడ్డి, యాదయ్య, కిషన్‌రెడ్డి, విజయనిర్మల పాల్గొన్నారు.

వెజి(ట్ర)బుల్ హబ్!



వంటిమామిడి కూరగాయల మార్కెట్

కూరగాయ పంటలను దెబ్బతీసిన వానలు

- తెగుళ్ల దాడితో భారీ నష్టం
- గణనీయంగా పడిపోయిన దిగుబడులు
- ఈ ప్రాంతంపై ఆధారపడిన జంట నగరాలకు తప్పని ఇబ్బంది
- రాష్ట్రీయ మార్కెట్ల పరిస్థితీ అంతే

కూరగాయల సాగుతో కళకళలాడే ఉమ్మడి మెదక్ జిల్లా ఎడతెరిపిలేని వానలకు విలవిల్లాడుతోంది. పంటలకు తెగుళ్లు సోకి ఉత్పత్తులు గణనీయంగా పడిపోయాయి. ఇతర ప్రాంతాలకు ఎగుమతి తగ్గి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కుళ్లిన పంటలు చూసి రైతులు బోరుమంటున్నారు.

గజ్వేల్: ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలు కూరగాయల రైతులను అతలాకుతలం చేశాయి. 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించిన ఉమ్మడి మెదక్ జిల్లాను అతివృష్టి తీవ్రంగా దెబ్బ తీసింది. పదిరోజులపాటు తెరిపి లేకుండా పడిన వానల కారణంగా కూరగాయ పంటలకు తెగుళ్లు సోకి ఉత్పత్తులు గణనీయంగా పడిపోయాయి. దీంతో ఎన్నో ఆశలతో కూరగాయలు సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు.

కూరగాయల సాగు అధికం

ఉమ్మడి మెదక్ జిల్లా(సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్)లోని కూరగాయల సాగు అధికంగా ఉండటం వల్ల ఈ ప్రాంతం 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించింది. ఇందులో భాగంగానే ములుగు, చిన్నకోడూర్, వర్గల్, దౌల్తాబాద్, దుబ్బాక, మిర్‌దొడ్డి, తొగుట, చేర్యాల, గజ్వేల్, కొమురవెల్లి, కొండపాక, రాయపోల్, అక్కన్నపేట, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ, మద్దూర్, జగదేవ్‌పూర్, మర్కూక్, నంగునూర్, నారాయణరావుపేట, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, జిన్నారం, గుమ్మడిదల, సంగారెడ్డి, జహీరాబాద్, తూప్రాన్, శివ్వంపేట, నర్సాపూర్, చేగుంట తదితర మండలాల్లో కూరగాయలు అధికంగా సాగు చేస్తారు. ప్రధానంగా టమాట, బీర, బెండ, కాకర, సోర, ఆలుగడ్డ, బీన్స్, క్యాబేజీ, వంకాయ తదితర పంటలు పండిస్తారు. ప్రతి సీజన్‌లో సుమారు 70వేల ఎకరాలకుపైనే సాగు జరుగుతుంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ఉమ్మడి జిల్లాలో పండించే కూరగాయలను కొనుగోలు చేయడానికి రిలయన్స్, హెరిటేజ్, స్పెన్సార్ తదితర మల్టీనేషనల్ కంపెనీలు ఆసక్తి చూపుతాయి. అంతేకాకుండా ప్రభుత్వం ములుగు మండలం వంటిమామిడి వద్ద కూరగాయల మార్కెట్ యార్డు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించింది. హైదరాబాద్‌నగర వాసుల అవసరాలకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని కూరగాయల ఉత్పత్తులే ప్రధాన వనరుగా మారాయి. ఇక్కడ ఉత్పత్తులు తగ్గితే నగరంలో జనం అల్లాడే పరిస్థితి ఉంటుంది. ఇక్కడి కూరగాయలు జంటనగరాల్లోని బోయిన్‌పల్లి, మూసాపేట, ఎర్రగడ్డ, అల్వాల్, కుషాయిగూడ, ఉప్పల్, ఎల్బీనగర్, మాధన్నపేట, సబ్జీమండీ, మిరియాల మండీ, మెహిదీపట్నం, కూకట్‌పల్లి మార్కెట్‌లకు వెళ్తాయి. ప్రస్తుతం ఇక్కడ కూరగాయల ఉత్పత్తి తగ్గడంతో జంటనగర వాసులకు ఇబ్బంది తప్పదని చెప్పొచ్చు. అంతేకాకుండా ఇక్కడి నుంచి బెంగళూర్, విశాఖపట్నం, చెన్నై, మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాందేడ్, ముంబయితోపాటు ఢిల్లీకి కూడా ఎగుమతి అవుతాయి.

తెగుళ్లతో పంటలకు దెబ్బ

జూలై 20 నుంచి వారం పదిరోజులు తెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా కురగాయల పంటలకు అపార నష్టం సంభవించింది. చేలల్లో నీరు నిలిచి పంటలకు వేరుకుళ్లు, ఇతర తెగుళ్లు సోకింది. పొలాల్లో ఎక్కడికక్కడ పంట కుళ్లిపోవడం వల్ల పంటను దున్నేస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో పంటకు నష్టం జరిగింది. మరోవైపు ఇక్కడి కూరగాయలపై ఆధారపడిన జంటనగరాలు, రాష్ట్రీయ మార్కెట్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఉత్పత్తులు గణనీయంగా పడిపోతుండటంతో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి.

పడిపోయిన ఉత్పత్తులు

తెరిపిలేని వర్షాల కారణంగా గజ్వేల్ నియోజకవర్గంలో కూరగాయల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీనివల్ల ములుగు మండలం వంటిమామిడిలోని మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు పడిపోయాయి. ఈ మార్కెట్‌లో సీజన్ బాగుంటే నిత్యం 1500–2000 క్వింటాళ్ల కూరగాయల లావాదేవీలు జరుగుతాయి. కానీ ప్రస్తుతం వెయ్యి క్వింటాళ్లు దాటడమే గగనమవుతోందని వంటిమామిడి మార్కెట్ కమిటీ అధికారులు చెబుతున్నారు. ఇక్కడే కాదు ప్రైవేట్ కలెక్షన్ సెంటర్లలోనూ సగానికిపైగా ఉత్పత్తులు తగ్గాయి.

వానలకు పాడైన టమాట

మంచి ధర పలుకుతుందనే ఆశతో నాకున్న రెండెకరాల పొలంలో అర ఎకరా టమాట, ఎకరాలో బీరకాయ తోటను సాగు చేశా. పదిహేను రోజులుగా ఆగకుండా వానలు కొట్టడంతో టమాట మొత్తం నీళ్లలో మునిగి కుళ్లిపోయింది. మొత్తం దున్నేసిన. పంట పెట్టుబడి రూ.30వేలు పూర్తిగా నష్టపోయిన. బీర తోటకు కూడా తెగుళ్ల వచ్చి రంగు మారింది. ఎలా కోలుకోవాలో తెలియడం లేదు.

– కనకయ్య, కూరగాయల రైతు, పాతూర్, మర్కూక్ మండలం

తెరిపిలేని వర్షాలతో నష్టం

తెరిపిలేని వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన మాట వాస్తవమే. వేరుకుళ్లు తెగులు సంభవించడం నష్టాల తీవ్రతను పెంచింది. క్షేత్రస్థాయిలో రైతులు ఈ విషయాలను మా దృష్టికి తెస్తున్నారు. నష్ట నివారణ చర్యలపై సలహాలు సూచనలు ఇస్తున్నాం.

– సౌమ్య, గజ్వేల్ ఉద్యానవన శాఖ అధికారి

ఆరోగ్య తెలంగాణను సాధిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న రోజాశర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆరోగ్య తెలంగాణను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సిద్దిపేటకమాన్: నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. జిల్లాలో 980 ప్రభుత్వ, 227 ప్రైవేటు పాఠశాలలు, 53 కళాశాలలు, 1,125 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 2,37,981 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గురువారం 1,95,192 మంది (82 శాతం) పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

బీటీ రోడ్డుకు భూమి పూజ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలపరిధిలోని మాచాపూర్ నుంచి రంగాయపల్లి వరకు రూ.2.44కోట్లతో నిర్మించే బీటీరోడ్డుకు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బాబు, ఉమేష్ చంద్ర, నవీన్, జమున, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు రోజాశర్మ పంపిణీ చేశారు.

మత్స్యకార సొసైటీల బలోపేతం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మత్స్యకార సొసైటీలను బలోపేతం చేస్తామని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి ధర్మారెడ్డిపల్లిలోని శోభ గార్డెన్స్‌లో నిర్వహించిన మత్స్యకార సొసైటీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ముదిరాజులకు ప్రభుత్వం ఏటా రూ.100కోట్ల ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని చెప్పారు. సొసైటీల్లోని సభ్యులందరికీ రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో 80 మత్స్యకార సొసైటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 3వేలమందికిపైగా సభ్యత్వం కల్పించి గుర్తింపు కార్డులను మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా త్వరలో అందజేస్తామని తెలిపారు. జిల్లా సొసైటీలోనూ గజ్వేల్ సభ్యులకు డైరెక్టర్లుగా అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. సమావేశంలో నాచారం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, జిల్లా మత్స్యకార సొసైటీ డైరెక్టర్ పడిగె రాజు, దాసరి నరేష్, సత్యనారాయణ, కొట్టాల రాజు, వీర శ్రీనివాస్, బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు భేష్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు సేవలు ఉత్తమంగా ఉన్నాయని మెదక్ రీజనల్ మేనేజర్ సుదర్శన్, డిప్యూటీ ఆపరేషన్స్ మేనేజర్ దైవాదీనం పేర్కొన్నారు. ప్రజ్ఞాపూర్ జీపీపీ ఆర్టీసీ డిపోను జూన్, జూలైలో అభివృద్ధి బాటలో నడిపేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లతో పాటు మెకానిక్ సిబ్బందిని అభినందించి సన్మానించారు. అనంతరం ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, ఎస్‌టీఐ కనకలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: రాబోయే శాసనసభ సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1500కు మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సిద్దిపేట ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ముసాయిదా ఓటరు జాబితాను ఈనెల 21న ప్రచురిస్తామన్నారు. తుది ఓటర్ జాబితాను అక్టోబర్ 4న ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఓటింగ్‌కు ఇబ్బంది కాకుండా ఒక పోలింగ్ కేంద్ర పరిధిలో 1000 మంది ఓటర్లు ఉండేలా ఎన్నికల సంఘానికి నివేదించాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓలు రమేష్, బెన్ షాలేం, బన్సీలాల్, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, డీటీ శ్రీనివాస్, నాయకులు జి.మోహన్‌లాల్, ఎండి ఇమాముద్దీన్, శ్రీనివాస్, సురేష్, యాదగిరి, జ్యోతి బాబు పాల్గొన్నారు.

మద్యం షాపులకు రిజర్వేషన్ డ్రా

జిల్లాలో మద్యం షాపుల నిర్వహణకుగాను ఎస్సీ, బీసీ గౌడ కులస్తుల రిజర్వేషన్ ఎంపిక కోసం గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆధ్వర్యంలో డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 93 మద్యం దుకాణాలు ఉండగా.. వాటిలో 9 ఎస్సీ సామాజిక వర్గానికి, 16 గౌడ కులాలకు లాటరీ ద్వారా షాపులను ఎంపిక చేసివాటి ఆమోదానికి రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, కవిత, మురళి, అధికారులు పాల్గొన్నారు.

నోటరీ డాక్యుమెంట్లను రెగ్యులర్ చేసుకోవాలి

నోటరీ ద్వారా పట్టణ ప్రాంతాలలో కొనుగోలు చేసిన స్థలాలను రెగ్యులరైజ్ చేసుకోవడానికి జీఓఎంఎస్ 84 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 125 చదరపు గజాలు, అంతలోపు ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించేందుకు స్టాంప్ డ్యూటీ, పెనాల్టీ ఉండదని చెప్పారు. 125 నుంచి 3వేల చదరపు గజాల లోపు ఉన్న భూమికి మార్కెట్ విలువ ప్రకారం స్టాంపుడ్యూటీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఇందూరు కళాశాల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలను సీపీ శ్వేతతో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు బ్లాక్‌లను పరిశీలించి వాటిని సిద్ధం చేయాలని మున్సిపల్ ఇంజినీర్లను ఆదేశించారు.

ఐఓసీ నిర్మాణ పనుల జాప్యంపై ఆగ్రహం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల కేంద్రంలో రూ.7.5 కోట్లతో నిర్మిస్తున్న ఐఓసీ పనులను గురువారం కలెక్టర్ పరిశీలించారు. పనులు నత్తనడకన సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫ్లోరింగ్, సంప్ నిర్మాణ పనులు సగం కూడా పూర్తి కాకపోవడంతో కాంట్రాక్టుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గఢా అధికారి ముత్యంరెడ్డి, ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ నీలిమ, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కాపురం చేయడం లేదని కక్షగట్టి..

- అక్క, భర్తను మట్టుబెట్టించిన భార్య
- రూ.50 వేలు సుపారీ.. ఇద్దరు నిందితుల అరెస్టు
- వీడిన జంటహత్య కేసుల మిస్టరీ



జంట హత్య కేసు వివరాలను వివరిస్తున్న డీఎస్పీ పురుషోత్తం రెడ్డి. చిత్రంలో నిందితులు కూడా ఉన్నారు

హత్నూర (సంగారెడ్డి): తనతో సరిగా సంసారం చేయడం లేదని కక్షగట్టిన మొదటి భార్య పథకం ప్రకారం భర్తను, సొంత అక్కను హత్య చేయించింది. సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులకు అడ్డంగా దొరికిపోవడంతో జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్ కేసు వివరాలను మీడియాకు వివరించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడెం తండాకు చెందిన ధనావత్ పీఖ్యకు భాష (25), బేబీ (23) కూతుర్లు ఉన్నారు. వారికి వివాహాలు కూడా చేశారు. చిన్న కూతురు బేబీ, భర్త లక్ష్మణ్ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, కొన్నేళ్ల క్రితం పెద్ద కూతురు భాష భర్తతో గొడవపడి విడిపోయి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో చెల్లెలి భర్త లక్ష్మణ్‌తో సన్నిహితంగా ఉంటూ రెండో పెళ్లి చేసుకుంది. ఈ క్రమంలోనే తనతో కాపురం సక్రమంగా చేయడం లేదని కక్షగట్టిన మొదటి భార్య బేబీ.. భర్త లక్ష్మణ్‌తో పాటు అక్కపై కక్ష పెంచుకుంది. దీంతో వారిద్దరిని హత్య చేయించేందుకు పథకం వేసింది.

జూన్ 17న అదృశ్యం..

లక్ష్మణ్, భాష జూన్ 17న కూలి పనుల కోసం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యారు. అదే నెల 24న హత్నూర మండలం రొయ్యపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతురాలి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా ఆమె ఆచూకీని గుర్తించారు. అయితే.. ఈ ఘటన జరిగినప్పటి నుంచి కనిపించకుండా పోయిన భర్త లక్ష్మణ్ హత్య చేసి ఉంటాడని అనుమానించిన పోలీసులు.. అతని ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. కానీ దర్యాప్తు కొనసాగిస్తున్న క్రమంలో కొత్తకోణం వెలుగుచూసింది.

కక్ష గట్టి.. సుపారీ ఇచ్చి..

భర్త లక్ష్మణ్ తనతో సరిగా సంసారం చేయడం లేదని బేబీ కక్ష పెంచుకుంది. ఎలాగైనా లక్ష్మణ్‌తో పాటు అక్క భాషను హత్య చేయించాలని నిర్ణయించుకుంది. అదే తండాకు చెందిన వరుసకు అన్న అయ్యే బానోత్ వినోద్‌తో రూ.50 వేలకు సుపారీ కుదుర్చుకుంది. ఐదు వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. మాయమాటలు చెప్పి లక్ష్మణ్, భాషను పనికోసమని చెప్పి వినోద్ వద్దకు పంపించింది. తర్వాత ముగ్గురూ కలిసి హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి అటవీ ప్రాంతంలోని పలుగుమీది నల్ల పోచమ్మ ఆలయం వద్ద మద్యం సేవించి అక్కడి నుంచి రొయ్యపల్లి అటవీ ప్రాంతానికి వెళ్లారు. చీకటి పడుతున్న సమయంలో లక్ష్మణ్ తలపైన వినోద్ బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేశాడు. అడ్డుకోబోయిన భాషను కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. ఆమె ఒంటిపై బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్‌తో పాటు నగదుతో పారిపోయాడు. కాగా, తనకు అప్పుల బాధ ఎక్కువైందని, తన భార్య సొమ్ములను కుదువ పెట్టాలని, ఇందుకు సాయం చేయాలని సాగిరెడ్డిపల్లికి చెందిన స్నేహితుడు నరేశ్‌కు వినోద్ ఫోన్ చేశాడు. ఇద్దరు కలిసి శివ్వంపేట మండలం గోమారంలోని ఓ దుకాణంలో రూ.1.50లక్షలు తనఖా పెట్టారు. మరోవైపు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో లక్ష్మణ్ ఫోన్ నుంచి ఎవరెవరికి కాల్స్ వెళ్లాయని ఆరా తీయగా.. అందులో వినోద్ పేరు బయటకు వచ్చింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. భార్యాభర్తలను తానే హత్య చేశానని వినోద్ అంగీకరించాడు. లక్ష్మణ్ కోసం గాలిస్తున్న క్రమంలో అతను కూడా హత్యకు గురయ్యాడని తెలిసి పోలీసులు షాక్‌కు గురయ్యారు. లక్ష్మణ్ అస్థి పంజరానికి పోస్టుమార్టం నిర్వహించారు. జంట హత్యలకు సూత్రధారులైన ధనావత్ బేబీ, వినోద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన జిన్నారం సీఐ వేణుకుమార్, ఎస్సైలు లక్ష్మారెడ్డి విజయరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఎస్పీ సైతం అభినందిస్తూ పారితోషికాన్ని ప్రకటించారని డీఎస్పీ పురుషోత్తంరెడ్డి తెలిపారు.



సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రైతు బంధువు సీఎం కేసీఆర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రైతు బంధువు సీఎం కేసీఆర్ అని, వారి అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు వంగ నాగిరెడ్డి అన్నారు. రైతుల రుణమాఫీ ప్రక్రియను చేపట్టిన సందర్భంగా కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఫ్లెక్సీలకు గురువారం పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సూడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చ విజిత వేణుగోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధర్మాసాగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

60 ఇళ్లలో సోదాలు, 45 బైక్‌లు సీజ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్‌లో 45 వాహనాలు సీజ్ చేశారు. నర్సాపూర్ సీఐ షేక్ లాలమధర్, కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు కమ్యూనిటీ కనెక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 60 ఇళ్లలో సోదాలు నిర్వహించగా సరైన ధ్రువపత్రాలు లేని 45 బైక్‌లు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. అతివేగం ప్రమాదమని చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు విఠల్, శ్రీనివాస్ పోలీసులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్



చెక్కు అందిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు రూ.6 ,82,500ల చెక్కుల గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకు వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయాలు సీఎం సహాయ నిధి ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ మండల అధ్యక్షుడు విఠల్, కొండాపూర్ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలి మృతి

పటాన్‌చెరుటౌన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీహరి కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లికి చెందిన శ్యామలమ్మ(62) కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేదు. ఆపై ఫిట్స్‌తో బాధపడుతుండేది. గురువారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి శ్యామలమ్మ గ్రామ సమీపంలో ఉన్న నల్లచెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉసురుతీసిన కుటుంబ కలహాలు

- ఉరేసుకొని భార్య, రైలు కిందపడి భర్త ఆత్మహత్య
- మాసాయిపేటలో ఘటన



హేమలత



మహేశ్

చేగుంట (తూప్రాన్): కుటుంబ కలహాలు భార్యాభర్తలను బలితీసుకుంది. గంటల వ్యవధిలోనే ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మెదక్‌జిల్లా తూప్రాన్ మండలం మాసాయిపేటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన కాశబోయిన మహేశ్(36), హేమలతకు(28) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. మహేశ్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా మహేశ్ మద్యానికి బానిసై ఇంట్లో తరచూ గొడవపడేవాడు. రెండు రోజులు క్రితం ఇద్దరి మధ్య మళ్లీ ఘర్షణ పడగా.. ఆమె మాసాయిపేటకు వచ్చింది. ఈ క్రమంలో గురువారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపం చెందిన హేమలత.. ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలిసిన మహేశ్.. తన సోదరుడు నవీన్‌కు కాల్ చేసి తాను రైలుకింద పడి చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే అతను తన తండ్రి దర్శన్‌కు చెప్పగా, శ్రీనివాస్ నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా అప్పటికే రైలు కిందపడి మహేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట ఎస్‌ఐ హరీశ్ ,కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావూనాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యవంతులతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధిలో పయనిస్తోందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ×గడా× ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డితో కలిసి విద్యార్థులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు కళాశాలల్లో విద్యార్థులకు నట్టల నివారణ మందులు అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు నులిపురుగు నివారణ మందులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ దాసరి అమరావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శ్రీకాంత్ ఆడవార్

పటాన్‌టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన శ్రీకాంత్ ఆడవార్(42) బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. గురువారం తెల్లవారుజాము 1.30 సమయంలో నడుచుకుంటూ ముత్తంగి రింగ్ రోడ్ సమీపంలో సిల్వర్ బావర్చి ఎదురుగా రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడ మృతిచెందాడు. మృతుడి భార్య మనీని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మద్యంమత్తులో వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: మద్యంమత్తులో అనేగుంటకు చెందిన రాజగారి అశోక్(33)ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను కూలీ పనిచేసుకునేవాడు. తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. ఈ బాధతో మద్యంమత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కవిత పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి అతడు విగతజీవిగా కనిపించాడు.

గౌరారంలో యువకుడు ...

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో గౌరారంలో వెల్దుర్తి ఉదయ్(31)ఆత్మహత్య చేసుకున్నాడు. 6 నెలల నుంచి అతను మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం సెలూన్‌షాపునకు వెళ్లి రాత్రయినా రాలేదు. భార్య శ్వేత పాత ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు.

ఆర్థిక ఇబ్బందులతో ..



గణేష్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగోజిగూడలోచెందిన గణేష్‌గౌడ్(45) వ్యవసాయంతో చేసుకుంటూనే పెయింటింగ్ పని చేసుకునేవాడు. పిల్లల ఉన్నత చదువులకు ఫీజులు, అనారోగ్య సమస్యలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం సాయంత్రం పొలంలో పురుగుల ముందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి కొంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజాము మృతిచెందాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన ప్రకారం.. కుప్పానగర్‌కు చెందిన మర్పల్లి నాగన్న(36) కొన్నేళ్లుగా గ్రామ శివారులోని నసీబ్ స్టోన్ కంకర్ మిషన్ వద్ద ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం క్రషర్ వద్ద విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా షాక్ తగిలి మృతిచెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరిసరాల శుభ్రతపై దృష్టిసారించాలి



అంబాజిపేటలో పండ్ల తోటల పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

- జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గజగట్లపల్లి గ్రామపంచాయతీని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పరిసరాలు పరిశీలించారు. ఆపై రికార్డులనూ తనిఖీలు చేశారు. గ్రామంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తకుండా అవసరమైన పరిసరాలు శుభ్రం చేయాలని సర్పంచ్ మీనారవిందర్‌కు, గ్రామ కార్యదర్శి సంతోష్‌కు సూచించారు. అనంతరం మండలంలోని అంబాజిపేటలో పండ్ల తోటల పెంపకం పనులు పరిశీలించి, ఈజీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

రుణమాఫీ వడ్డీకే సరిపోదు

- డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

పాపన్నపేట(మెదక్): సీఎం ప్రకటించిన రుణమాఫీ రైతు చెల్లించిన వడ్డీకి సరిపోదని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం ఆయన, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డితో కలిసి పాపన్నపేటలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గాంధారిపల్లిలో గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎండుగుల భూలక్ష్మి, విఠల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో రుణమాఫీ చేస్తానని సీఎం ప్రకటించారని, 5 ఏళ్ల తర్వాత ఎన్నికల వేళ ఇది ఓటు బ్యాంకు రాజకీయమేనన్నారు. ఈ 5 ఏళ్లలో రైతు తీసుకున్న రుణం వడ్డీతో కలిసి డబుల్ అయ్యిందన్నారు. వీఆర్‌ఏలను మరో డిపార్ట్ మెంట్‌లోకి పంపితే గ్రామాల్లో పాలన కుంటుపడుతోంన్నారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ 10ఏళ్లలో టీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు.

'గురుకులం'లో వైద్య బృందం

- కండ్ల కలకతో బాధపడుతున్న విద్యార్థులకు సూచనలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వైద్యులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సందర్శించారు. పాఠశాలలో కొంతమంది విద్యార్థులు కండ్ల కలకతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న వైద్యుల బృందం గురువారం పాఠశాలను సందర్శించి తాజా పరిస్థితిపై ఆరా తీసింది. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇతరులకు సోకకుండా ఉండేలా సూచనలు చేశారు. తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి వారిని ఐసోలేషన్‌లో ఉండాల్సిందిగా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో కండ్ల కలక అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతోందన్నారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వారి వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్ : గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన బీడీఎల్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని పాటీ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 448లో చిపోలమడుగు(కొల్లూరు - వెలిమెల నుంచి వచ్చే కాలువ) కాలువలో గురువారం గుర్తుతెలియని మహిళ(35) మృతదేహం గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అప్పటికే కుళ్లిపోగా.. మృతి చెంది 10 నుంచి 12 రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుడికాలికి పట్టి, గులాబీ కలర్ పాయింట్ ధరించి ఉందని తెలిపారు. ఆ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకులం విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో గురుకులం ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది

నర్సాపూర్: తమ గురుకులం విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చినారని స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. బుధవారం మెదక్‌లో జరిగిన పోటీలలో తమ విద్యార్థులు పాల్గొన్నారని వారిలో కొందరు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని చెప్పారు. వంద మీటర్ల పరుగు పందెంలో 14 ఏళ్ల కేటగిరిలో బాలు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడన్నారు. 16 ఏళ్ల కేటగిరిలో వంద మీటర్ల పరుగు పందెంలో అశోక్, 18ఏళ్ల కేటగిరిలో జావెలిన్ త్రో పోటీలో శివ ప్రథమ స్థానంలో నిలిచాడని, 18 ఏళ్ల కేటగిరిలో వంద, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో అర్జున్, కృష్ణలు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని భిక్షమయ్య వివరించారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడి రాజీనామా

సిద్దిపేటకమాన్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తుపాకుల బాల్‌రంగం తెలిపారు. ఆయనతోపాటు సిద్దిపేట అర్బన్, రూరల్, మండలాలతో పాటు నారాయణరావుపేట, నంగునూరు, చిన్నకోడూరు మండలాల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు సైతం రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ మహాసభ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ అనాలోచిత నిర్ణయాల వల్లే తాము ముదిరాజ్ మహాసభకు రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల కిషన్, అర్బన్ మండలాధ్యక్షుడు జక్కుల సిద్ధిరాములు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రూ.5,177 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని వెంటనే విడుదల చేయాలని, చేయని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, కార్యదర్శి దాసరి ప్రశాంత్, కొండం సంజీవ్ కుమార్, శేఖర్, సంతోష్, పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల పరిశీలన



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు ప్రశాంత్

మర్కూక్(గజ్వేల్): ఉపాధ్యాయులకు మౌలిక భాష, గణిత సమస్యల సాధనపై శిక్షణా కార్యక్రమం మర్కూక్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతుంది. గురువారం రాష్ట్ర పరిశీలకుడు ప్రశాంత్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం సుగుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలీనంతో మరింత బాధ్యత

ఆర్‌ఎం సుదర్శన్



ప్రశంసా పత్రాలు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

సిద్దిపేటకమాన్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మరింత బాధ్యత పెరిగిందని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్‌ఎం సుదర్శన్ అన్నారు. గురువారం డిపోలో నిర్వహించిన ప్రగతి చక్ర అవార్డులో సిద్దిపేట, దుబ్బాక డిపోలో 94 మంది ఉత్తమ సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందుకు సీఎం కేసీఆర్, ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, రవాణశాఖ మంత్రి అజయ్‌కుమార్, సంస్థ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ రీజియన్ మొదటి స్థానంలో, సిద్దిపేట డిపో తొలి స్థానంలో తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ దైవాదీనం, డీఎం సుఖేందర్‌రెడ్డి, మౌలానా, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారుడికి తీవ్రగాయాలు

గజ్వేల్‌రూరల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనదారుడు ఢీ కొన్నాడు. ఈ ఘటన గురువారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్)కు చెందిన నాయిని యాదగిరి ఎల్కక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనిపై బైక్‌పై గజ్వేల్ బయలుదేరాడు. మార్గం మధ్యలో పాత ఆర్డీఓ కార్యాలయం వద్ద వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ఘటనలో యాదగిరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఆరోగ్య సిద్దిపేటను సాధిద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్య సిద్దిపేటను సాధిద్దామని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. గురువారం స్వచ్ఛసిద్దిపేటలో భాగంగా పట్టణంలో ''నడుస్తూ చెత్తను తొలగిద్దాం'' కార్యక్రమం గురువారం స్థానిక 21వ వార్డులో నిర్వహించారు. వార్డు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రముఖ దంతవైద్యుడు అరవింద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 6, 7వ తరగతి విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుఖేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎల్లం యాదవ్, ప్రధానోపాధ్యాయుడు భగవంతయ్య, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులను పర్మనెంట్ చేయాలి

హుస్నాబాద్: రాష్ట్రంలో సుమారు 12వేల మంది హోంగార్డులు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారని వారిని వెంటనే పర్మనెంట్ చేసి ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇతర ఉద్యోగుల మాదిరిగా హోంగార్డులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, ఇంటి అద్దె అలవెన్స్, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

హరితహారం మొక్కల పంపిణీ



హుస్నాబాద్:మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

చేర్యాల(సిద్దిపేట): హరితహారంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని 1 నుంచి 6వ వార్డులో ఇంటింటికి హరితహారం మొక్కల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యురాలు అంజనీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: కార్యక్రమంలో ధర్మాజీపేట 8 వార్డు కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, తదితరులున్నారు.

హుస్నాబాద్: కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేయండి

- కలెక్టరేట్ ఎదుట ఈసాదారుల నిరసన
- కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏ ఈసాదారులు

మెదక్ కలెక్టరేట్: వీఆర్‌ఏలలో అసలుదారులకు ఒక్కరికే రెగ్యులర్ చేయడంతో ఈసాదారులం రోడ్డు పడుతామని, అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషాను వీఆర్‌ఏలు కోరారు. కొల్చారం మండలం ఎనగండ్ల, పాపన్నపేట, నిజాంపేట మండలం చల్మెడ గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలు(నీరుడిలు, మస్కూరిలు) గురువారం కలెక్టరేట్ వద్దకు తరలివచ్చి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసాదారులు మాట్లాడుతూ, వీఆర్‌ఏలు అనేది గ్రామాల్లో ఉమ్మడి హక్కు అని, ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ఈసాదారులు ఉంటారన్నారు. సీఎం కేసీఆర్ కేవలం అందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్చారం మండలం ఎనగండ్లకు చెందిన మానయ్య, సామయ్య, రాజు, దాసు, నర్సింలు, భూమయ్య, పాపన్నపేటకు చెందిన సామెల్ పాల్గొన్నారు.